www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | గురువారం, సెప్టెంబర్24,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:201 | పేజీలు: 8 | వెల: రూ.5/-

మీ మధ్య ఎప్పుడూ వివాదాలేనా?

కృష్ణా నదీ జలాల పంపకాల వివాదంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు మధ్య నదీ జలాల విషయంలో ఎప్పుడూ వివాదాలేనా? అని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. కృష్ణా జలాల వివాద ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం, తదుపరి విచారణను నవంబర్ 4వ తేదీకి వాయిదా వేసింది. 2010లో బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని ట్రైబ్యునల్, కృష్ణా నదిలో నీటి లభ్యతను 65 శాతం విశ్వసనీయత ఆధారంగా లెక్కగట్టింది. దీనివల్ల కర్ణాటకకు అదనపు జలాలు కేటాయింపుతో పాటు, ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచుకునేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర విభజన తర్వాత ఈ కేసులో తెలంగాణ కూడా భాగస్వామిగా చేరింది.

రాష్ట్ర ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే

చారిత్రాత్మక ఘట్టం

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు
- అధికారులంతా స్ఫూర్తితో ఏర్పాట్లలో భాగం కావాలి

దేశ, విదేశాల్లో రోడ్‌షోలు.. వార్‌రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ డిప్యూటీ భట్టి

హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం



తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఏడాది డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. 'తెలంగాణ భవిష్యత్తును, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖ రాలకు చేర్చే ఈ చారిత్రాత్మక ఘట్టంలో అధికారులంతా భాగస్వాములై గ్లోబల్ సమ్మిట్‌ను దిగ్విజయం చేయాలి' అని పిలుపునిచ్చారు.ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సదస్సు సన్నాహక సమావే శాన్ని బుధవారం సచివాలయంలో నిర్వహించా రు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు(ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు, ప్రచారం, రోడ్‌షోల నిర్వహణపై డిప్యూటీ సీఎం పక్కా కార్యాచరణను ఖరారు చేశారు.ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచ సదస్సు ఇదని, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులతో 10 కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని వెల్లడించారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అధికారుల కమి టీలతోపాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లు గా నియమించినట్లు తెలిపారు. ప్రతి కమిటీకి కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి పనులు ప్రారంభించాలని సూచించారు.

రాయలసీమకు లక్ష కోట్ల

వరం

అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

- లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఆరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలు
- నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- రిలయన్స్ ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ స్కూల్‌కు కూడా అంకురార్పణ



అమరావతిసామాన్యుడి అస్త్రం

దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న రాయలసీమ రూపురేఖలను మార్చే బృహత్తర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లెలో జరిగే కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమం ద్వారా సీమ రైతాంగ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు అందనుండగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించనున్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న

చార్మినార్

- హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం
- లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం
- మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి




హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం

భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది.సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శక లాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

జూరాలకు నీటి విడుదలకు ఓకే

- జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం
- విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రర్)

తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది.

భారత పాస్‌పోర్ట్ పరమ చెత్తది

- భారత పాస్‌పోర్ట్‌పై హైదరాబాదీ వ్యాపారవేత్త సంచలన పోస్ట్
- ఇండియన్ పాస్‌పోర్ట్ 'పూర్తిగా నిరర్థకమైనది' అంటూ వ్యాఖ్య



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రర్)

'భారత పాస్‌పోర్ట్ పరమ చెత్తది' అంటూ హైదరాబాద్‌కు చెందిన ఒక యువ పారిశ్రామికవేత్త చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపుతున్నాయి. అధిక పన్నులు చెల్లిస్తున్నా అందుకు తగిన ప్రయోజనాలు అందడం లేదంటూ ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. వ్యవస్థా పకుడైన జితేంద్ర ('ఎక్స్' వేదికగా చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది.

గణేశ్ నిమజ్జనం రద్దీ దృష్ట్యా

అనుమతి కష్టం

- ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సినిమా చూస్తానన్న హీరో నాని..
- గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనను గుర్తు చేసిన డీజీపీ
- హైదరాబాద్ సిటీ పోలీసులతో చర్చించాకే తుది నిర్ణయమని వెల్లడి



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో తాను నటించిన చిత్రాన్ని వీక్షించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నటుడు నాని చేసిన విన్నపంపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పందించారు. 'ఎక్స్' వేదికగా దీనిపై ఆయన తన స్పందనను తెలియజేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ సమయంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతం అత్యంత రద్దీగా ఉంటుందని ఆయన గుర్తు చేశారు.నిమజ్జన వాహనాలు, భక్తుల రాకతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుందని డీజీపీ పేర్కొన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో ఎలాంటి కార్యక్రమం నిర్వహించాలన్నా హైదరాబాద్ సిటీ పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. నగర పోలీసులతో చర్చించిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా సుమారు రెండేళ్ల క్రితం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనను సీవీ ఆనంద్ ప్రస్తావించారు.

ఏపీ ఇంటర్ 2027 పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం
- రూ.1,000 ఆలస్య రుసుముతో నవంబర్ 10 వరకు గడువు
- గడువు తేదీలను పొడిగించేది లేదని స్పష్టం చేసిన విద్యామండలి

అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌లో 2027లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఈ గడువు తేదీలను గమనించి సకాలంలో ఫీజు చెల్లించాలని బోర్డు అధికారులు సూచించారు.విద్యామండలి వెల్లడించిన వివరాల ప్రకారం, ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సాధారణ ఫీజు చెల్లింపునకు 2026 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు అవకాశం కల్పించారు. ఈ గడువులోగా ఫీజు చెల్లించని విద్యార్థులు, రూ. 1,000 ఆలస్య రుసుముతో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పట్ల దారుణం

- క్యాబ్ ఎక్కుతుండగా బలవంతంగా ముద్దుపెట్టుకున్న సెక్యూరిటీ గార్డ్
- యువతి కేకలు వేయడంతో పరారైన నిందితుడు



హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సెక్యూరిటీ గార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందిరా నగర్ ప్రాంతంలో ఈ ఘటన వెలుగుచూసింది.ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి క్యాబ్ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా, రాజ్‌కుమార్ అనే సెక్యూరిటీ గార్డ్ ఆమె వద్దకు వచ్చాడు. ఒక్కసారిగా ఆమెను పక్కకు లాగి బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు.

తిరుమలలో వైభవంగా చక్రస్నానం

- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



అమరావతి,సామాన్యుడి అస్త్రం

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు..

రాష్ట్ర ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే చారిత్రాత్మక ఘట్టం

మొదటి పేజి తరువాయి

అన్ని విభాగాలను సమ న్వయం చేసుకుంటూ ప్రతిరోజూ కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. 'ఈ రోజు నుంచే ప్రతిరోజూ సదస్సుకు సంబంధించిన ఏదో ఒక వార్త మారుమోగాలి. ప్రచారానికి ఆకాశమే హద్దుగా పనిచేసి, పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలి' అని అధికారులకు స్పష్టం చేశారు.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర లక్ష్యంలో ఈ సమ్మిట్ కీలక మైలురాయి కానుందని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఎంవో యూలను కూడా సమీక్షించి, వాటి అమలు పురోగతిని పరిశీలించాలని అధికారులను ఆదేశిం చారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతి అధికారి భాగస్వామి కావాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లను కేవలం ఒక కార్యక్ర మంగా కాకుండా రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆస్తిగా తీర్చిదిద్దాలన్నారు.తెలంగాణ కు పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దేశాలు, నగరాలు,



రంగాలను గుర్తించి దాని కి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించి మంత్రిమండలి ఉపసంఘానికి నివేదించా లని ఆదేశించారు. అధికారులు వెంటనే తమ టీమ్‌లతో సమావేశమై వార్‌రూమ్ ద్వారా పనులను పర్యవేక్షించాలని, ప్రతిరోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేసిన తర్వాతే రోజువారీ బాధ్యతలు ముగించాలని చెప్పారు.ప్రతినిధుల స్పందనను బట్టి అవసరమైతే ప్రస్తుతం అనుకుంటున్న 4 సభా ప్రాంగణాలను (హాల్స్) 6 లేదా 8కి పెంచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించా రు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక వికాసంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడా రాజీ పడకుండా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.తెలంగాణ విశిష్టత ప్రతిబింబించాలి: మంత్రి శ్రీధర్‌బాబురాష్ట్రంలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్ కేవలం పెట్టుబడుల సమీకరణకే పరిమితం కాకుండా, తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఉం డాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫైవ్‌స్టార్ హోటళ్ల వాతావరణం దేశవ్యాప్తంగా ఎక్కడైనా సాధారణంగానే ఉంటుందని, అయితే మన రాష్ట్ర ప్రత్యేకతను విదేశీ, జాతీ య ప్రతినిధులకు పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం, మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు ఈవెంట్‌లో ప్రధానంగా ఆకట్టుకునేలా ఉండాలని సంబంధిత అధికారి హరిచందనకు సూచించారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి దాదాపు 2వేల నుంచి 3వేల మంది ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి మన సంస్కృతి ఒక దృశ్యకావ్యంగా నిలిచిపోవాలని అభిప్రాయపడ్డారు.ఢిల్లీలో జరిగిన జీ20, బ్రిక్స్ సమ్మిట్‌ల తరహాలోనే సాయంత్రం వేళ్లలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు మన వారసత్వాన్ని చాటిచెప్పేలా ప్లాన్ చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రధానంగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమైనప్పటికీ, అంతర్జాతీయ వేదికపై నూతన తెలం గాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి చాటిచెప్పడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని ఉద్ఘాటించారు.

రాయలసీమకు లక్ష కోట్ల వరం

మొదటి పేజి తరువాయి

కేంద్ర ప్రభుత్వ 'పూర్వోదయ' పథకం కింద ఈ రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లు అందనుండగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించనున్నారు. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీరందిస్తూనే, మరోవైపు ఉద్యానవన పంటలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతాల్లో సంపద సృష్టించి, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ హబ్ ప్రధాన ఉద్దేశం. ఇదే కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.



వరుస కార్యక్రమాలతో సీఎం బిజీ

ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటూ తీరిక లేకుండా గడపనున్నారు. సెప్టెంబర్ 29: ఉదయం విజయవాడలో జరిగే ణుూూ కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించే 'పల్లె పండుగ'కు హాజరవుతారు.

సెప్టెంబర్ 30: విజయవాడలో 24 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అక్టోబర్ 1: రాష్ట్రవ్యాప్తంగా జరిగే 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు.

అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా ఉదయం మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం విజయవాడలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్టోబర్ 3: విజయవాడలో జరిగే పాన్ ఐఐటీ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ వరుస కార్యక్రమాలతో సీఎం ఐదు రోజుల పాటు ప్రజలతో మమేకం కానున్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.

మొదటి పేజి తరువాయి

మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి

శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

భారత పాస్‌పోర్ట్ పరమ చెత్తది

మొదటి పేజి తరువాయి

విదేశీ ప్రయాణాల కోసం భారత పాస్‌పోర్ట్ హోల్డర్లు పడుతున్న ఇబ్బందులను జితేంద్ర తన పోస్ట్‌లో ప్రస్తావించారు. "మంచి దేశాలకు వెళ్లాలంటే వీసా కోసం రోజుల తరబడి ఎదురుచూడాలి లేదా వేల పేజీల డాక్యుమెంట్లు సమర్పించాలి. కొన్ని దేశాలకు సులభంగా వెళ్లేందుకు అమెరికా వీసా ఒక షార్ట్‌కట్‌లా పనిచేస్తోంది. అలాంటప్పుడు భారత పాస్‌పోర్ట్ హోల్డర్లకు ప్రయాణ సౌలభ్యం కోసం మరో విదేశీ వీసా ఎందుకు అవసరం కావాలి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విధానం భారత పాస్‌పోర్ట్ హోల్డర్ల కదలికలను నియంత్రిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సమస్యను ఆయన పన్ను చెల్లింపులతో ముడిపెట్టారు. తాను ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో ఏటా రూ.75 లక్షల నుంచి రూ.1 కోటి వరకు చెల్లిస్తున్నప్పటికీ, దానికి ప్రతిఫలంగా స్థానికంగా గానీ, అంతర్జాతీయంగా గానీ తనకు ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు. దేశానికి అత్యధిక పన్నులు చెల్లిస్తున్న పౌరులకు కూడా కనీస ప్రయోజనాలు దక్కకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇలాంటి ప్రయాణ ఆంక్షలు, వ్యవస్థాగత ఇబ్బందుల వల్లే చాలామంది ప్రతిభావంతులైన భారతీయులు ఇతర దేశాల పౌరసత్వం లేదా పాస్‌పోర్టుల కోసం ప్రయత్నిస్తున్నారని ఆయన విశ్లేషించారు. సమస్యలకు గతాన్ని నిందించడం కంటే ప్రస్తుత సవాళ్లను గుర్తించి, వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కాగా, జితేంద్ర అమెరికాలోని నార్తర్న్ ఇల్లినాయిస్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు.జితేంద్ర పోస్ట్‌పై ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది నెటిజన్లు ఆయన వాదనతో ఏకీభవిస్తూ, మెరుగైన అంతర్జాతీయ ప్రయాణ సౌలభ్యం, వ్యవస్థాగత మార్పులు అవసరమని వ్యాఖ్యానించారు. మరికొందరు మాత్రం ఆయన విమర్శలను తప్పుబట్టారు. వీసాల విషయంలో తమ వ్యక్తిగత అనుభవాలు భిన్నంగా ఉన్నాయని, భారత పాస్‌పోర్ట్ గతంతో పోలిస్తే బలోపేతమైందని అభిప్రాయపడ్డారు.

ఏపీ ఇంటర్ 2027 పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

మొదటి పేజి తరువాయి

పరీక్ష ఫీజుల వివరాలు ఇలా ఉన్నాయి:

ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలకు: రూ. 600

రెండు సంవత్సరాల థియరీ పరీక్షలకు కలిపి: రూ. 1,200

సీనియర్ ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు: రూ. 275

బ్రిడ్జ్ కోర్సుకు: రూ. 165

నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఫీజు చెల్లింపు తేదీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ప్రసక్తే లేదని ఇంటర్ విద్యామండలి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

గణేశ్ నిమజ్జనం రద్దీ దృష్ట్యా అనుమతి కష్టం

మొదటి పేజి తరువాయి

నిమజ్జన వాహనాలు, భక్తుల రాకతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుందని డీజీపీ పేర్కొన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో ఎలాంటి కార్యక్రమం నిర్వహించాలన్నా హైదరాబాద్ సిటీ పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. నగర పోలీసులతో చర్చించిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా సుమారు రెండేళ్ల క్రితం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనను సీవీ ఆనంద్ ప్రస్తావించారు. ఆ ప్రమాదంలో ఓ మహిళ, ఆమె చిన్న కుమారుడు తీవ్రంగా గాయపడ్డారని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందగా, బాలుడు శాశ్వత వైకల్యానికి గురయ్యాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అటువంటి చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వివరించారు. తన పోస్ట్‌లో నటుడు నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో పాటు మరికొందరిని ఆయన ట్యాగ్ చేశారు.

జూరాలకు నీటి విడుదలకు ఓకే

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారుతెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పట్ల దారుణం

మొదటి పేజి తరువాయి

యువతి కేకలు వేయడంతో పరారైన నిందితుడు

సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఝార్ఖండ్‌కు చెందిన రాజ్‌కుమార్‌గా గుర్తింపు

ఈ ఆకస్మిక పరిణామంతో దిగ్భ్రాంతికి గురైన బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని ఝార్ఖండ్‌కు చెందిన రాజ్‌కుమార్‌గా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

తిరుమలలో వైభవంగా చక్రస్నానం

మొదటి పేజి తరువాయి

మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ

సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడుఅంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

యాదాద్రిపై రూ.40 వేల కోట్ల అదనపు భారం..

జీ -- 9 బొగ్గు లేకుంటే ప్లాంట్ ఎందుకు నిర్మించారు?
పిట్‌హెడ్‌కు దూరంగా ఏర్పాటు చేయడంపై సీఎం ఆరా
ఎంసీఎల్, కోల్‌ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు ఆదేశం
దసరాలోపు పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేయాలని స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 23సామాన్యుడి అస్త్రం

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై దీర్ఘకాలంలో రాష్ట్రానికి పడుతున్న అదనపు ఆర్థిక భారం, బొగ్గు లభ్యత, ప్లాంట్ సామర్థ్యం వంటి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఆరా తీశారు. జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమయ్యే సాంకేతికతతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను నిర్మించినప్పటికీ.. సింగరేణిలో ప్రస్తుతం ఆ గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. బొగ్గు లభ్యతపై ముందస్తు ప్రణాళిక లేకుండా ఇంత భారీ ప్రాజెక్టును ఎలా నిర్మించారని నిలదీశారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో విద్యుత్ శాఖపై సీఎం, డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు, యాదాద్రి ప్లాంట్ పనితీరు, బొగ్గు సరఫరా, సింగరేణి పరిస్థితి తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా వివరించారు. యాదాద్రి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలంటే జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వెల్లడించారు. అయితే సింగరేణిలో ప్రస్తుతం ఆ గ్రేడ్ బొగ్గును ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్‌లోనూ అక్కడి నుంచి జీ-9 బొగ్గు లభించే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని తెలిపారు.

బొగ్గు లేకుంటే ప్లాంట్ ఎలా నిర్మించారు?

జీ -- 9 బొగ్గు లభ్యత లేదని తెలిసినప్పుడు అదే సాంకేతికతతో యాదాద్రి ప్లాంట్‌ను ఎందుకు నిర్మించారంటూ సీఎం, డిప్యూటీ సీఎం అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు ఇంధన లభ్యత, రవాణా సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ఆరా తీశారు. అలాగే బొగ్గు గనులకు సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేసే పిట్‌హెడ్ విధానాన్ని అనుసరించకుండా గనులకు దూరంగా యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. దీనివల్ల బొగ్గు రవాణా వ్యయం, దీర్ఘకాలికంగా రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత ఉంటుందో పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



రూ.40 వేల కోట్ల అదనపు భారం

యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా, రవాణా తదితర అంశాల కారణంగా దీర్ఘకాలంలో తెలంగాణపై సుమారు రూ.40 వేల కోట్ల మేర అదనపు భారం పడే అవకాశం ఉందని అధికారులు సమీక్షలో వివరించినట్లు సమాచారం. ఇంత భారీ ఆర్థిక భారం పడే పరిస్థితిని ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే ఎందుకు అంచనా వేయలేదని సీఎం ప్రశ్నించారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సింగరేణికి అవసరమైన బొగ్గు బ్లాకులు అందుబాటులోకి తెచ్చే అవకాశాలపైనా సమీక్షించారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు వివరించినట్లు తెలిసింది.

ఎంసీఎల్, కోల్‌ఇండియా నుంచి బొగ్గు

రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని యాదాద్రి ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ప్రత్యామ్నాయ వనరుల నుంచి సమకూర్చుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం నిర్ణయించారు. మహానది కోల్‌ఫీల్డ్స్ (ఎంసీఎల్), కోల్‌ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు సరఫరాలో జాప్యం లేకుండా ఒప్పందాలు, రవాణా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. ముందస్తు బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. యాదాద్రికి బొగ్గు సరఫరాను పెంచే దిశగా సింగరేణి ఇప్పటికే ఒడిశాలోని నైనీ గనుల నుంచి తరలింపును పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తాజా సమాచారం.

కిషన్‌రెడ్డితో వెంటనే చర్చలు

కేంద్రం నుంచి అవసరమైన సహకారం పొందేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో తక్షణమే చర్చించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. బొగ్గు బ్లాకులు, సరఫరా, రవాణా అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్‌లో బొగ్గు కొరత తలెత్తకుండా దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

దసరాలోపు పూర్తి ఉత్పత్తి

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. దసరాలోపు ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. బొగ్గు సరఫరా, ప్లాంట్ నిర్వహణ, ఉత్పత్తి సామర్థ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్, ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్, టీజీఆర్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, సింగరేణి డైరెక్టర్ పి.గౌతమ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట భద్రత..
20 వేల మంది పోలీసులతో బందోబస్తు

10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లతో నిఘా
బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ప్రత్యేక కార్యాచరణ
పుకార్లు సృష్టిస్తే ఉపేక్షించబోం: హైదరాబాద్ సీపీ సజ్జనార్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 సామాన్యుడి అస్త్రం

గణేశ్ నిమజ్జన మహోత్సవానికి హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం సన్నద్ధమైంది. రేపు(శుక్రవారం) జరగనున్న మహానిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నగరవ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ, పొరుగు జిల్లాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులు, వేలాది గణేశ్ విగ్రహాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు చేపట్టింది. మొత్తం దాదాపు 20 వేల మంది పోలీసు సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించనున్నారు. ఇప్పటివరకు వివిధ ప్రాంతాలకు చెందిన 32,878 విగ్రహాల నిమజ్జనం పూర్తికాగా, ఇందులో హైదరాబాద్ నగరానికి చెందినవి 6,108 ఉన్నాయి. గత 24 గంటల్లోనే నగర పరిధిలో 2,161 విగ్రహాలు నిమజ్జనమయ్యాయి. చివరి రోజు బాలాపూర్ గణేశ్ విగ్రహంతో జరిగే తుది శోభాయాత్రకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణకు హైదరాబాద్ సిటీ పోలీస్ మూడు నెలల ముందే ఏర్పాట్లను ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 12న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేయగా, 13న మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో వివిధ ప్రభుత్వ శాఖలతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అన్ని శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్



గ్రూపులను ఏర్పాటు చేశారు.14,929 మండపాలకు అనుమతులు

మండపాల ఏర్పాటులో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంలో 15,426 దరఖాస్తులు అందగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 14,929 మండపాలకు అనుమతులు మంజూరు చేశారు. అనుమతి పొందిన మండపాలన్నింటినీ జియో ట్యాగ్ చేశారు. శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులు వినియోగిస్తున్నారు. ప్రధాన శోభాయాత్ర మార్గాల్లోని 10 వేల సీసీ కెమెరాలను బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. కీలక ప్రాంతాల్లో నిఘా కోసం 24 అత్యాధునిక డ్రోన్లను వినియోగిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో సుమారు 100 హైరైజ్ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా విగ్రహాల రాకను కూడా లెక్కిస్తున్నారు.

8,142 మంది అదనపు సిబ్బంది

శాంతిభద్రతల పరిరక్షణ కోసం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ తదితర విభాగాలకు చెందిన సిబ్బంది విధుల్లో ఉంటారు. ఇతర జిల్లాల నుంచి నిమజ్జన బందోబస్తులో అనుభవం ఉన్న 8,142 మంది అధికారులు, సిబ్బందితో కూడిన 42 ప్లాటూన్లను రప్పించి ఏడు జోన్లకు కేటాయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నాలుగు ఆర్ఏఎఫ్ కంపెనీలను చార్మినార్, గోల్కొండ, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లలో, రెండు సీఆర్‌పీఎఫ్ కంపెనీలను ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లో మోహరించారు. 53 బాంబ్ డిస్పోజల్ బృందాలు కూడా విధుల్లో ఉంటాయి. నగర ప్రవేశ మార్గాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు.

మహిళల భద్రతకు షీ టీమ్స్

మహిళలు, యువతుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మూడు షిఫ్టుల్లో 26 షీ టీమ్స్ విధుల్లో ఉంటాయి. సెప్టెంబర్ 14 నుంచి ఇప్పటివరకు ఖైరతాబాద్, బాలాపూర్ తదితర రద్దీ ప్రాంతాల్లో అసభ్యంగా ప్రవర్తించిన 1,172 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 1,121 మంది మేజర్లు, 51 మంది మైనర్లు ఉన్నారు. ఊరేగింపుల్లో డీజేలు, సౌండ్ మిక్సర్లు, అధిక శబ్ద తీవ్రత కలిగించే పరికరాలు, బాణసంచా వినియోగంపై పోలీసులు ఆంక్షలు విధించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పరికరాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్మీ, పర్యాటక శాఖలకు చెందిన శిక్షణ పొందిన గజ ఈతగాళ్లు, రెస్క్యూ బోట్లను సిద్ధంగా ఉంచారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం మొబైల్, స్టాటిక్ జనరేటర్లు, రాత్రివేళ నిఘా కోసం వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. వైద్య సేవల కోసం పారామెడికల్ సిబ్బందితో కూడిన అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

ప్రజలు సహకరించాలి: సీపీ సజ్జనార్

గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా ముగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఉత్సవాల పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించడం, సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, పుకార్లు వ్యాప్తి చేయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

లింగాల గ్రామస్థుల కోసం ఆగిన మంత్రి ఉత్తమ్.. లింక్ రోడ్ల దుస్థితిపై సర్పంచ్ విజ్ఞప్తి



పెన్ పహాడ్ సామాన్యుడి అస్త్రం

: మండలంలోని లింగాల గ్రామం మీదుగా మేడారంలో నూతన గ్రంథాలయం ప్రారంభించడానికి వెళుతుండగా గ్రామస్థుల కోరిక మేరకు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లింగాలలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా లింగాల ఎక్స్ రోడ్డు నుంచి మేడారం మీదుగా నేరేడుచర్ల వరకు రూ. 26 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారి పనులు పూర్తై ప్రజల వినియోగంలోకి వచ్చినందుకు స్థానిక సర్పంచ్ గార్లపాటి స్వర్ణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గ్రామస్తుల తరుపున శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలోని లింక్ రోడ్ల దుస్థితిని సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని లింగాల--పొట్లపహాడ్, అన్నారం--గడ్డిపల్లి రహదారులకు నిధులు మంజూరు చేసి బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతేకాకుండా గ్రామస్థుల సహకారంతో నిర్మిస్తున్న శివాలయాన్ని మంత్రి సందర్శించి, గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు.

ఇక ఇంటి వద్దకే 'మీసేవ' సేవలు..



హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

తెలంగాణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలక ముందడుగు వేశారు. మీసేవ సేవలు నేరుగా పౌరుల ఇంటి వద్దకే అందేలా రూపొందించిన 'మీసేవ డోర్ డెలివరీ సర్వీసెస్' పోర్టల్‌ను హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజలు మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా నేరుగా సర్వీసులను పొందే వెసులుబాటు అందుబాటులోకి వచ్చిందన్నారు.

సేవలు ఎలా పొందాలి?:

ప్రజలు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా గానీ, లేదా అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా గానీ ముందుగానే తమ సమయాన్ని బుక్ చేసుకోవచ్చు. ఇంటి వద్దకే ఎగ్జిక్యూటివ్: స్లాట్ బుకింగ్ పూర్తయిన వెంటనే మీసేవ ప్రతినిధి నేరుగా దరఖాస్తుదారు నివాసానికి వచ్చి అవసరమైన దరఖాస్తులను, ధ్రువీకరణ పత్రాలను స్వీకరిస్తారు. సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేయడంలో భాగంగానే ఈ వినూత్న సేవలకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు.


రైతులకు గుడ్ న్యూస్.. దోమలవారు మినీ రిజర్వాయర్‌కు అనుమతులు



హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం

బూర్గంపాడు మండల రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మండలంలోని దోమలవారు ప్రాజెక్టు వద్ద మినీ రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీంతో సాగునీటి సమస్యలకు పరిష్కారం లభించనుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మినీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. పంటల సాగుకు నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంది. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ చూపారని స్థానికులు పేర్కొన్నారు.త్వరలో టెండర్లు పిలిచి రిజర్వాయర్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీంతో దోమలవారు ప్రాజెక్టు పరిధిలోని రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు



గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25న జీహెచ్ఎంసీ పరిధిలో సెలవు

ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక నిఘా

నిమజ్జనం రోజు నగరంలోకి ప్రైవేట్ బస్సులు, లారీలకు అనుమతి నో

డీజేలు, అసభ్య నృత్యాలపై కఠిన చర్యలని సీపీ హెచ్చరిక

హైదరాబాద్సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. ఈ నెల 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హై-రైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

గోదావరి, దేవాదుల ప్రాజెక్టు నీళ్లను సంపూర్ణంగా వినియోగించుకుంటాం: మంత్రి ఉత్తమ్



సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 23సామాన్యుడి అస్త్రం

గోదావరి, దేవాదుల ప్రాజెక్టు నీళ్లను సంపూర్ణంగా వినియోగించుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి) స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీళ్లు తెప్పిస్తానని మాటిచ్చారు. ఈరోజు (బుధవారం) సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆ నీటిని ఉపయోగించుకుంటాం..

365 టీఎంసీల నీటిని చుక్క నీరు కూడా వృథా కాకుండా ఉపయోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. మొత్తం దేవాదుల ప్రాజెక్టు నీళ్లు 768 టీఎంసీలు ఉన్నాయని.. అందులో 465 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు.. మరో 365 టీఎంసీలు తెలంగాణ వినియోగించుకుంటాయని వెల్లడించారు. ఏ విధమైన రాజకీయ దురుద్దేశం లేకుండా కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను రిపేర్ చేయించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా మా నాన్న కోరిక మేరకు తాటిపాముల గ్రామాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.

రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం నీచ రాజకీయం

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తున్నాం

నీటి కొరతపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోంది

జూరాల నుంచి సాగునీటి విడుదలపై కర్ణాటక సీఎంతో చర్చలపై సానుకూల స్పందన

బీఆర్ఎస్‌కు ఎల్ నినో రాజకీయ ఆయుధం

కరువు రావాలని, పంటలు ఎండాలనే పైశాచికానందం ఆ పార్టీది

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల, సెప్టెంబర్ 23సామాన్యుడి అస్త్రం

రైతు కన్నీటిలో బీఆర్ఎస్ పార్టీ) ఓట్లు వెతకడం నీచ రాజకీయానికి నిదర్శనం అని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(అన్నారు. వచ్చే వేసవిలో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తోందని వెల్లడించారు. అందులో భాగంగానే జూరాల() నుంచి సాగునీటి విడుదల)పై కర్ణాటక సీఎంతో జరిపిన చర్చలకు సానుకూల స్పందన వచ్చిందని చెప్పారు.సూర్యాపేట జిల్లా(నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్ల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్ల డబుల్ రోడ్డును బుధవారం ప్రారంభించారు. అలాగే జానల్దిన్నె గ్రామపంచాయతీ భవనం(, నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.రైతుల కష్టాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణం కాదని మండిపడ్డారు. 'ఎల్ నినో' అనేది కాంగ్రెస్ కార్యాలయంలో పుట్టిన పదం కాదు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం.



పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే వేడెక్కినప్పుడు ప్రపంచ వాతావరణ సమూనాలు మారుతాయి.భారత రుతుపవనాలపైనా దాని ప్రభావం పడుతుంది. ఈసారి కొన్ని కీలక దశల్లో వర్షపాతం దాదాపు 40 శాతం వరకు తగ్గింది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వంపై విషప్రచారం చేయడం బీఆర్ఎస్ రాజకీయ దివాలా కోరుతనానికి నిదర్శనం' అని విమర్శించారు. ఆకాశంలో ఎల్ నినో వర్షాలను అడ్డుకుంటే భూమిపై బీఆర్ఎస్ అబద్ధాల వరద పారిస్తోందని విమర్శించారు.

పాలం ఎండితే మాకు బాధ.. బీఆర్ఎస్‌కు అవకాశం

రైతు పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది, బీఆర్ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. జలాశయాల్లో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ సాగు చేసిన పంటలను కాపాడటం, రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోంది. సమస్య వచ్చినప్పుడు పరిష్కారాన్ని వెతికేది కాంగ్రెస్ ప్రభుత్వం. సమస్య మరింత పెరగాలని కోరుకునేది బీఆర్ఎస్. మేము రైతు పంటను కాపాడేందుకు నీళ్ల కోసం రాష్ట్రాల తలుపులు తడుతున్నాం. వాళ్లు మాత్రం హైదరాబాద్‌లో కూర్చొని అబద్ధాల వరద పారిస్తున్నారు' అని దుయ్యబట్టారు.

పంటలను కాపాడేందుకు కృషి

జూరాల ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర సీఎం డీకే శివకుమార్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. తెలంగాణ విజ్ఞప్తికి డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారని, నీటి లభ్యతను పరిశీలించి సహకరించేందుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 'మేం కర్ణాటకతో మాట్లాడి నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల వద్దకు వెళ్లి భయం సృష్టిస్తున్నారు. మాకు రాజకీయాల కంటే పంటలు ముఖ్యం, ప్రచారం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం' అని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతుందని చెప్పారు.అవసరమైన చోట నీటి విడుదల, ప్రత్యామ్నాయ వనరుల వినియోగం, జలాశయాల సమర్థ నిర్వహణపై నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. సాగు చేసిన పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనాథలుగా వదిలిపెట్టమని, రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. వేసవిలో ప్రజల గొంతు ఎండకుండా మంచినీటి సరఫరాకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

ఈ ప్రాంతంతో నాది ఆత్మీయ బంధం

హైదరాబాద్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' సన్నాహక సమావేశం ఉన్నప్పటికీ నేరేడుచర్ల రహదారి ప్రారంభోత్సవానికి ప్రత్యేకంగా హాజరయ్యానని మంత్రి తెలిపారు. ఈ రహదారిని ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంతో నాకు ఉన్నది కేవలం రాజకీయ సంబంధం కాదుప్రజలతో పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధం అన్నారుకార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కాంతం చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మేడారం సర్పంచ్ పారేపల్లి సత్యనారాయణ, జానలదిన్నె సర్పంచ్ గజ్జి సరిత, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీకాంత్, నేరేడుచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ప్రకాష్, పాలకవీడు మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, యువనాయకులు చలసాని రాజీవ్ పాల్గొన్నారు.

నాపై మహిళా డ్యాన్సర్లు దాడి చేశారు

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలతపై దాడి

రఘు మాస్టర్ వర్గం డ్యాన్సర్లు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

'మినిట్స్ బుక్' వివాదంతో మొదలైన గొడవ

డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి సుమలత తొలగింపు

అక్టోబర్ 11న అసోసియేషన్‌కు కొత్త ఎన్నికలు

హైదరాబాద్సామాన్యుడి అస్త్రం



టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత పోలీసులను ఆశ్రయించారు. తనపై కొందరు మహిళా డ్యాన్సర్లు దాడి చేశారని ఆరోపిస్తూ ఆమె బుధవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఆమెను తెలుగు సినిమా డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ ఫిల్మ్ ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది.కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్‌కు చెందిన మహిళా డ్యాన్సర్లు తనపై దాడికి పాల్పడ్డారని సుమలత తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మినిట్స్ బుక్' విషయంలో తలెత్తిన వివాదమే ఈ దాడికి కారణమని తెలుస్తోంది. అయితే, సుమలతే బలవంతంగా మినిట్స్ బుక్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, తాము అడ్డుకున్నామని అవతలి వర్గం ఆరోపిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.ఫిల్మ్ ఫెడరేషన్ నిర్వహించిన సమావేశంలో సుమలతకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. డ్యాన్సర్స్‌లలో ఆమెకు మెజారిటీ మద్దతు లేకపోవడంతో, ఆమె నేతృత్వంలోని కార్యవర్గాన్ని ఫెడరేషన్ పూర్తిగా రద్దు చేసింది. దీనితో ఆమె డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవిని కోల్పోయారు. మొత్తం 225 మంది డ్యాన్సర్లు హాజరైన ఈ సమావేశంలో సుమలతకు కేవలం 11 మంది మాత్రమే మద్దతు తెలపగా, రఘు మాస్టర్ వర్గానికి 214 మంది బాసటగా నిలిచారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అక్టోబర్ 11న డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

శుక్రవారం హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్

ఈ నెల 25న హైదరాబాద్ లో గణేశ్ మహా నిమజ్జనం

జంట నగరాల పరిధిలో మద్యం విక్రయాలు బంద్

స్టార్ హోటళ్లు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు

హైదరాబాద్సామాన్యుడి అస్త్రం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు.మరొకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.



అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.

ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు ఇవిగో!


ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం

రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి

మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర



అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

జగన్ పై మంత్రి ఫైర్

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు.డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది.ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.

కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.

ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.

చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎఎన ఊరటనిచ్చే నిర్ణయం.

ఇతర ముఖ్యమైన నిర్ణయాలు

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం



ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా

తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్

ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

టెక్కలి వద్ద విషాద ఘటన...

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం

రైలు ఢీకొని నలుగురు ఇంటర్ విద్యార్థులు అక్కడికక్కడే మృతి

భారీ వర్షం కారణంగా రైలు రాకను గమనించలేకపోయిన విద్యార్థులు

పట్టాల సమీపంలో చేపలు పడుతుండగా జరిగిన దుర్ఘటన

మరో విద్యార్థికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

శ్రీకాకుళం జిల్లాలో శనివారం అత్యంత విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. టెక్కలి సమీపంలో రైలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదంతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు టెక్కలి మండలం రావివలస వద్ద రైలు పట్టాల సమీపంలో వర్షపు నీరు భారీగా వచ్చి చేరింది. ఈ నీటిలో చేపలు పట్టేందుకు ఐదుగురు విద్యార్థులు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వారు పట్టాలు దాటుతుండగా, అదే సమయంలో భువనేశ్వర్ నుంచి గుణుపూర్ వెళుతున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది.కురుస్తున్న భారీ వర్షం, వీస్తున్న బలమైన ఈదురు గాలుల కారణంగా వెనుక నుంచి వస్తున్న రైలు శబ్దాన్ని విద్యార్థులు గమనించలేకపోయారు. ఈ ప్రమాదంలో విశాఖ రావు, దిలీప్, శరత్, శివ అనే నలుగురు విద్యార్థులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సాల్మన్ రాజు అనే మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.మృతులంతా టెక్కలి మండలం డమరు గ్రామానికి చెందిన వారని, టెక్కలిలోని ప్రభుత్వ ఎస్సీ/ఎస్టీ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నారని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడంతో బాధితుల కుటుంబాల్లోను, గ్రామంలోనూ రోదనలు మిన్నంటాయి.

ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు అప్‌డేట్..

పంపిణీ విధానంలో కీలక మార్పు

అక్టోబర్ 1 నుంచి ఏపీలో పింఛన్ల పంపిణీ విధానంలో మార్పు

కేంద్ర ప్రభుత్వ వాటా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ

రాష్ట్ర ప్రభుత్వ వాటా యథావిధిగా ఇంటివద్దకే పంపిణీ

9.34 లక్షల మంది ఎన్ఎస్ఏపీ లబ్ధిదారులకు ఈ నిబంధన వర్తింపు

ఆధార్ లింక్ అయిన బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా ఉంచుకోవాలని సూచన

అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీ విధానంలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) పరిధిలోని లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ వాటాను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను మాత్రం యథావిధిగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి నగదు రూపంలో అందజేస్తారు.కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే పంపాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మార్పు రాష్ట్రంలోని సుమారు 9.34 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వర్తించనుంది. ఉదాహరణకు, నెలకు రూ. 4,000 పింఛన్ పొందుతున్న వృద్ధులకు కేంద్రం వాటా అయిన రూ. 200 వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. మిగిలిన రూ. 3,800 మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దే నగదు రూపంలో పంపిణీ చేస్తుంది.రాష్ట్రంలో మొత్తం 62 లక్షల మంది ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులు ఉండగా, వారిలో కేవలం ఎన్ఎస్ఏపీ పరిధిలోకి వచ్చే 9.34 లక్షల మందికి మాత్రమే ఈ నూతన విధానం వర్తిస్తుంది. మిగిలిన 53 లక్షల మంది లబ్ధిదారులు తమ పూర్తి పింఛను మొత్తాన్ని ఎప్పటిలాగే తమ ఇంటి వద్దే నగదు రూపంలో అందుకుంటారు.కేంద్రం వాటా నిధులు సజావుగా జమ అయ్యేందుకు లబ్ధిదారులు తమ ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాలను క్రియాశీలకంగా ఉంచుకోవాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఖాతాలో నగదు జమ అయిన వెంటనే లబ్ధిదారుల ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుందని అధికారులు స్పష్టం చేశారు.



బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం



ఉత్తరాంధ్ర తీరానికి చేరువలో కేంద్రీకృతం

మరికొన్ని గంటల్లో విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం

కోస్తాంధ్రలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

గంటకు 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం

రాయలసీమలోనూ పలుచోట్ల భారీ వర్షాలు పడతాయని అంచనా

అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర కోస్తాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది గంటల్లోనే తీరాన్ని దాటనుండటంతో ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) హెచ్చరించింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 7 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఇది ఉత్తరాంధ్ర తీరానికి అత్యంత సమీపంలో, కళింగపట్నానికి నైరుతి దిశగా 30 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఈశాన్యంగా 90 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.ఈ వాయుగుండం రానున్న 3 నుంచి 4 గంటల్లో విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య, కళింగపట్నానికి సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

వాయుగుండం ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, యానాంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా, ఉత్తర కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్నిసార్లు గాలి వేగం గంటకు 70 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపారు.రాయలసీమలోనూ అనేక చోట్ల తేలికపాటి జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. వాయుగుండం తీరం దాటిన తర్వాత క్రమంగా బలహీనపడుతుంది. సెప్టెంబర్ 24 తర్వాత వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన గాలులు కొనసాగవచ్చని అధికారులు సూచించారు. తీరప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో... విశాఖ, మన్యం, విజయనగరం జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

ప్రభుత్వానికి 121 ఎకరాల భూమిని వెనక్కిచ్చిన రామ్‌కో సిమెంట్స్!



నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో భూములు

మైనింగ్‌కు ఆటంకాలే కారణమని తెలిపిన కంపెనీ

భూముల సరెండర్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

ప్రముఖ సిమెంట్ ఉత్పాదక సంస్థ రామ్‌కో సిమెంట్స్, గతంలో తమకు కేటాయించిన భూమిలో కొంత భాగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తిరిగి అప్పగించింది. నంద్యాల జిల్లాలో సున్నపురాయి మైనింగ్ నిమిత్తం కేటాయించిన 121.74 ఎకరాల భూమిని సరెండర్ చేస్తున్నట్లు కంపెనీ చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర గనుల శాఖ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది.నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఇటిక్యాల, కల్వట్ల, కొలిమిగుండ్ల గ్రామాల్లో ఈ భూమి విస్తరించి ఉంది. వాస్తవానికి, 2000వ సంవత్సరంలో రామ్‌కో సిమెంట్స్ సంస్థకు ప్రభుత్వం సుమారు 250 హెక్టార్ల భూమిని సున్నపురాయి మైనింగ్ లీజుకు కేటాయించింది. అందులో భాగంగా ఉన్న 121.74 ఎకరాల భూమిని తాజాగా కంపెనీ ప్రభుత్వానికి అప్పగించింది.ఆ భూమిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడం సాధ్యం కావడం లేదని రామ్‌కో సిమెంట్స్ తన అభ్యర్థనలో పేర్కొంది. లీజుకు తీసుకున్న భూమిని ఆనుకుని ఒక కాలువ ప్రవహిస్తుండటంతో పాటు, అదే ప్రాంతంలో హై-టెన్షన్ విద్యుత్ టవర్లు ఉండటం వల్ల మైనింగ్ పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని కంపెనీ స్పష్టం చేసింది.కంపెనీ విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. సంస్థ స్వచ్ఛందంగా ముందుకు రావడంతో, సదరు 121.74 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో ఈ భూమిపై రామ్‌కో సిమెంట్స్ మైనింగ్ హక్కులు రద్దయ్యాయి.

విజయవాడలో డూండి గణపతి ఉత్సవాలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

విజయవాడ డూండి గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్

72 అడుగుల భారీ మట్టి విగ్రహానికి ప్రత్యేక పూజలు

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, బుద్దా వెంకన్న

భవానీపురంలో ఘనంగా కొనసాగుతున్న నవరాత్రి వేడుకలు



అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

విజయవాడ నగరంలోని భవానీపురంలో డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 72 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి లోకేశ్‌తో పాటు ఈ పూజా కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జ్ బుద్దా వెంకన్న, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు. డూండి గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకులు డూండి రాకేశ్, ఇతర ప్రతినిధులు మంత్రికి స్వాగతం పలికి, స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.ప్రతి ఏటా విజయవాడలో డూండి గణపతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. భారీ విగ్రహం, వైవిధ్యభరితమైన అలంకరణతో ఈ మండపం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ ఏడాది కూడా పర్యావరణ హితంగా 72 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!



టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు

వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు

2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ

ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు

చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది. 2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

రాష్ట్రవ్యాప్తంగా 963 పాఠశాలల్లో హార్ట్‌ఫుల్ యోగా శిక్షణకు చర్యలు

టెన్త్, ఇంటర్‌లో 90% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి

పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి



అమరావతి,సెప్టెంబర్23సామాన్యుడి అస్త్రం

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం 'కేర్ ఏపీ' అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు 'హార్ట్‌ఫుల్ యోగా' శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఖీ=నా) అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన 'అక్షర ఆంధ్ర' ద్వారా వచ్చే ఏడాది చివరికల్లా నూరు శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు.నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, పీఎం సేతు పథకం కింద పారిశ్రామికవేత్తల సహకారంతో తొలి విడతగా 10 పారిశ్రామిక అనుసంధానిత ఐటీఐ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

అల్లంతో హై బీపీకి చెక్

ఆహారంలో వినియోగించే అల్లం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. హైబీపీని నియంత్రించడంలో ఇది చక్కగా సాయపడుతుందన్నారు. అలాగే అనేక అనారోగ్య సమస్యలను కూడా తగ్గిస్తుంది.

అల్లం వాడడం వల్ల..

అల్లంలో అనేక జీవక్రియశీల సమ్మేళనాలు(ఉంటాయి. ఇవి హైబీపీని సాధారణ స్థితికి తీసుకురావడానికి దోహదపడతాయి. అల్లంలో జింజెరోల్, షాగావోల్ తదితర సమ్మేళనాలు ఉంటాయి. అదే విధంగా వీటిలో యాంటీఆక్సిడెంట్, యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి హైబీపీని నియంత్రించడంలో సహాయపడతాయి. అల్లం తినడం వల్ల రక్తనాళాలు సాధారణ స్థితికి వస్తాయి. తద్వారా శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడటం సహా హైబీపీ సమస్యను తగ్గిస్తుంది.

ఇతర వ్యాధులకు చెక్..



అల్లంలో వాపు నిరోధక గుణాలు ఉంటాయి. ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా వాపును తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అల్లం తీసుకోవడం వల్ల శరీరంలోని హానికరమైన విష పదార్థాలతోపాటు వ్యర్థాలనూ తొలగిస్తాయి. కీళ్లు, కండరాలలో నొప్పి ఉంటే.. అల్లం తీసుకోవడం వల్ల ఇట్టే తగ్గిపోతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే జలుబు, దగ్గును తగ్గించడంలో అల్లం ప్రభావవంతంగా పని చేస్తుంది. అల్లంను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంచుకోవడం సహా వైరల్, సీజనల్ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు.

రోజూ పాలను తాగితే ఆస్టియోపోరోసిస్ వస్తుందా..
నిపుణులు ఏమంటున్నారు..?

పాలు తాగితే ఎముకలు బలంగా ఉంటాయని తరతరాలుగా చెబుతూ వస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఎక్కువగా పాలు తాగడం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థోపెడిక్ నిపుణులు ఈ అపోహలను ఖండిస్తూ, మితంగా పాలు తీసుకోవడం వల్ల ఎముకలకు ఎలాంటి హాని ఉండదని స్పష్టం చేస్తున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఎముకల కోసం పాలు మాత్రమే కాకుండా సమతుల ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకర జీవనశైలి కూడా అంతే ముఖ్యమని సూచిస్తున్నారు. పాలు లేదా మాంసాహారం ఎక్కువగా తీసుకుంటే శరీరంలో ఆమ్లత్వం పెరిగి, దానిని సమతుల్యం చేయడానికి ఎముకల నుంచి కాల్షియం బయటకు వస్తుందని ఒకప్పుడు యాసిడ్-యాష్ సిద్ధాంతం పేరుతో ప్రచారం జరిగింది. కానీ ఇటీవలి శాస్త్రీయ పరిశోధనలు ఈ సిద్ధాంతానికి ఎలాంటి బలమైన ఆధారాలు లేవని తేల్చాయి. సరిపడా కాల్షియంతోపాటు ప్రోటీన్ కూడా తీసుకుంటే ఎముకలు మరింత బలపడతాయని, ముఖ్యంగా వృద్ధాప్యంలో ఎముకలు విరిగే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

శాస్త్రీయ ఆధారాలు లేవు..

మితంగా లేదా కొంచెం ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం వల్ల ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందనే వాదనకు ఇప్పటివరకు శాస్త్రీయ ఆధారాలు లేవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న పరిశోధనల ప్రకారం పాలు, పాల ఉత్పత్తులను మితంగా తీసుకోవడం ఎముకల ఖనిజ సాంద్రతపై ప్రతికూల ప్రభావం చూపదని, కొన్ని సందర్భాల్లో సానుకూల ప్రభావం కూడా ఉంటుందని వెల్లడైంది. ఆస్టియోపోరోసిస్ అంటే ఎముకల ఖనిజ సాంద్రత తగ్గి అవి బలహీనపడే వ్యాధి. ఇది ఒక్క ఆహారం వల్ల మాత్రమే రాదు. వయస్సు పెరగడం, మహిళల్లో మెనోపాజ్ కారణంగా హార్మోన్ల మార్పులు, విటమిన్ డి లోపం, శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, అధిక మద్యపానం, పోషకాహార లోపం వంటి అనేక కారణాలు కలిసి ఈ సమస్యకు దారితీస్తాయని నిపుణులు వివరిస్తున్నారు.

అనేక పోషకాలకు పాలు మూలం..

పాలు కాల్షియం, ప్రోటీన్, ఫాస్పరస్, విటమిన్ డి (ఫోర్టిఫై చేసిన పాలలో) వంటి ఎముకల నిర్మాణానికి అవసరమైన కీలక పోషకాలకు మంచి మూలం. చిన్నతనం నుంచి యుక్తవయస్సు, పెద్దవయస్సు వరకు తగిన మోతాదులో కాల్షియం తీసుకోవడం వల్ల ఎముకలు గరిష్ఠ బలాన్ని సంతరించుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల పాలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అయితే పాలను అధికంగా తాగడం కూడా మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు మాత్రమే ఎక్కువగా తీసుకుని ఇతర ఆహారాలను తగ్గిస్తే శరీరానికి అవసరమైన ఇతర పోషకాలు అందవు. దీని వల్ల పోషకాహార అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కొందరిలో అజీర్ణం, అధిక కేలరీల వినియోగం వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి. కాబట్టి పాలను సమతుల ఆహారంలో భాగంగా మాత్రమే తీసుకోవాలి.

పాలను తాగలేకపోతే..

లాక్టోజ్ అసహనం (లాక్టోజ్ ఇంటోలరెన్స్) ఉన్నవారు పాలను జీర్ణించుకోలేరు. అలాంటి వారు కాల్షియం కోసం ఫోర్టిఫై చేసిన మొక్కల ఆధారిత పాలు, రాగి, టోఫూ, ఆకుకూరలు వంటి ప్రత్యామ్నాయ ఆహారాలను తీసుకోవచ్చు. వీటి ద్వారా కూడా శరీరానికి అవసరమైన కాల్షియం లభిస్తుంది. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పాలు ఒక్కటే సరిపోవని, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సూర్యరశ్మి ద్వారా విటమిన్ డి పొందడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం వంటి ఆరోగ్యకర అలవాట్లు పాటించడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మితంగా పాలు తాగడం వల్ల ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం పెరగదని, సరైన జీవనశైలిలో భాగంగా పాలు ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

గ్రీక్ యోగర్ట్.. పెరుగు ఒకటేనా?
ఏది ఆరోగ్యానికి మంచిది?

గ్రీక్ యోగర్ట్, పెరుగు ఒకటి కావు
గ్రీక్ యోగర్ట్‌లో ప్రోటీన్ ఎక్కువ
పెరుగులో కాల్షియం కొద్దిగా అధికం
రెండింట్లోనూ ప్రోబయోటిక్స్ ఉంటాయి
బరువు నియంత్రణకు గ్రీక్ యోగర్ట్‌కు ప్రాధాన్యం



గ్రీక్ యోగర్ట్, పెరుగు చూడటానికి దాదాపు ఒకేలా కనిపిస్తాయి. కానీ రెండూ ఒకటి కావు. తయారీ విధానం, పోషక విలువలు, రుచి, ప్రయోజనాల్లో స్పష్టమైన తేడాలు ఉంటాయి. మీ ఆరోగ్య లక్ష్యం ఏమిటనేదాన్ని బట్టి వీటిలో ఏది ఎంచుకోవాలో నిర్ణయించుకోవచ్చుసాధారణ పెరుగును... గోరువెచ్చని పాలలో మజ్జిగ లేదా పెరుగు కలిపి పులియబెట్టి తయారు చేస్తారు. గ్రీక్ యోగర్ట్‌ను మాత్రం సాధారణ పెరుగును పలుమార్లు వడకట్టి అందులోని నీటిని తొలగిస్తారు. అందుకే అది మరింత చిక్కగా, క్రీమీగా ఉంటుంది. రుచిలో కూడా తేడా కనిపిస్తుంది. పెరుగు తేలికగా, స్వల్ప పులుపుతో ఉంటుంది. గ్రీక్ యోగర్ట్‌లో పులుపు కాస్త ఎక్కువగా ఉంటుంది. చిక్కటి పదార్థం కావడంతో క్రీమీ అనుభూతి కూడా ఎక్కువగా ఉంటుంది.పోషక విలువల విషయానికి వస్తే గ్రీక్ యోగర్ట్‌లో ప్రొటీన్ శాతం ఎక్కువగా ఉంటుంది. వెన్న తొలగించే ప్రక్రియలో ప్రొటీన్ సాంద్రత పెరుగుతుంది. అందుకే వ్యాయామం చేసే వారు, కండరాల బలం పెంచుకోవాలనుకునే వారు దీన్ని ఎక్కువగా తీసుకుంటారు. మరోవైపు పెరుగులో కాల్షియం, కార్బోహైడ్రేట్లు కొద్దిగా ఎక్కువగా ఉండొచ్చు. అయితే ఇది ఉపయోగించే పాల రకాన్ని బట్టి మారుతుంది.రెండింట్లోనూ ప్రేగుల ఆరోగ్యానికి ఉపయోగపడే మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సాయపడతాయి. ఇంట్లో పరిశుభ్రంగా తయారు చేసిన పెరుగు కూడా మంచి ప్రోబయోటిక్ ఆహారమే. బరువు తగ్గాలనుకునేవారికి గ్రీక్ యోగర్ట్ మెరుగైన ఎంపికగా భావిస్తారు. ఇందులో ప్రొటీన్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. అయితే తక్కువ కొవ్వు ఉన్న పాలతో చేసిన పెరుగు కూడా బరువు నియంత్రణలో భాగం కావచ్చు.వాడకంలో మాత్రం పెరుగుదే పైచేయి. రైతా, మజ్జిగ, కూరలు, మారినేషన్, స్వీట్లలో పెరుగును విస్తృతంగా ఉపయోగిస్తారు. గ్రీక్ యోగర్ట్‌ను స్మూతీలు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్, సలాడ్ డ్రెస్సింగ్‌లు, డిప్స్, డెజర్ట్‌లలో ఎక్కువగా వాడుతారు. కొన్ని వంటల్లో క్రీమ్, మయోనైజ్‌కు ప్రత్యామ్నాయంగానూ ఉపయోగిస్తున్నారు.మొత్తానికి ఎక్కువ ప్రొటీన్ కావాలంటే గ్రీక్ యోగర్ట్ మంచి ఎంపిక. రోజువారీ ఆహారంలో సులభంగా కలిపి తీసుకోవాలంటే పెరుగు చక్కని ప్రత్యామ్నాయం

ఏడడుగుల దూరంలో ఆనందాల మజిలి



సంతోషం ఎక్కడో బయట దొరికేది కాదు. ఎంత ఖరీదు పెట్టినా సరే కూరగాయల్లా దానిని బజారులో కొనుక్కోలేం. మన ఆలోచనల్లో, అలవాట్లలో, జీవనశైలిలోనే అది దాగి ఉంటుంది. దాన్ని ఎలా సంపాదించుకోవాలో చెప్పే జపాన్ దేశానికి చెందిన ఏడు సూత్రాలు ఈమధ్య బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ముఖ్యంగా ఇంటి పనులతో సతమతమవుతూ జీవితం అంటే ఇంతేనా? అని ఇటీవలి కాలంలో నైరాశ్యానికి గురవుతున్న గృహిణులతో పాటు ఇంటా బయటా ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగినులకు ఇవి మంచి పాఠాలుగా ఉపయోగపడతాయి. ఇందులో ఇకిగై మనం చేసే పనులకు ప్రేరణ ఇస్తే, కైజెన్ ముందుకు నడిపిస్తుంది. హరా హాచిబు, పామొడోరో ఆరోగ్యాన్ని కాపాడుతాయి. కింట్సుగి, వాబి-సాబి మనసుకు బలాన్నిస్తాయి. సెయిరి-సెయిటోన్ క్రమబద్ధతను నేర్పుతాయి. ఈ ఏడు జపాన్ సూత్రాలను రోజువారీ జీవితంలో కొద్దికొద్దిగా ఆచరిస్తే ప్రతి మహిళా.. తన జీవితాన్ని మరింత ప్రశాంతంగా, అర్థవంతంగా, ఆనందమయంగా మార్చుకోవచ్చు.

ఇకిగై -- ప్రతి ఉదయానికీ ఒక అర్థం

ఉదయం లేవగానే 'ఈ రోజు నేను ఎందుకు ఉత్సాహంగా ఉండాలి?' అనే ప్రశ్నకు సమాధానమే ఇకిగై. చాలామంది మహిళలు తమ జీవితాన్ని కుటుంబ బాధ్యతలకే పరిమితం చేసుకుంటారు. అయితే తమకు ఇష్టమైన రచన, సంగీతం, తోటపని, సామాజిక సేవ, వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచుకోవడం వంటి ఏదో ఒక అంశాన్ని జీవిత లక్ష్యంగా ఎంచుకుంటే ప్రతి రోజూ కొత్త ఉత్సాహంతో మొదలవుతుంది. ఉద్యోగం చేస్తున్న మహిళకు తన పనిలోని సామాజిక ప్రయోజనం ఇకిగై కావచ్చు. గృహిణికి కుటుంబాన్ని సంతోషంగా ఉంచడం లేదా తన ప్రతిభను అభివృద్ధి చేసుకోవడం ఇకిగై కావచ్చు. జీవితానికి ఒక అర్థం కనిపించినప్పుడు ఒత్తిడి తగ్గి ఆత్మసంతృప్తి పెరుగుతుంది.

కైజెన్ -- రోజుకో చిన్న అడుగు

కొత్త సంవత్సరం వస్తే పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకోవడం సులభం. కానీ, వాటిని కొనసాగించడం కష్టం. కైజెన్ మాత్రం రోజుకు ఒక చిన్న మార్పు చాలని చెబుతుంది. బరువు తగ్గాలంటే మొదటి రోజే గంట వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. రోజుకు పది నిమిషాల నడకతో మొదలుపెట్టవచ్చు. పుస్తకాలు చదవాలంటే రోజుకు రెండు పేజీలు చదివితే సరిపోతుంది. ఇలా చిన్నచిన్నగా మెరుగవడం వల్ల కొద్ది నెలల్లో పెద్ద ఫలితాలు వస్తాయి. మహిళలు తమ ఆరోగ్యం, ఆర్థిక నిర్వహణ, వృత్తి నైపుణ్యాల్లో ఈ సూత్రాన్ని అనుసరిస్తే ఆశ్చర్యకరమైన మార్పులను చూడగలరు.

హరా హాచి బు -- ఆహార నియంత్రణ

ఇంట్లో అందరికీ వడ్డించి చివరగా తినే మహిళలు చాలామంది. కొన్నిసార్లు ఆకలి కంటే ఎక్కువ తినడం కూడా జరుగుతుంది. మిగిలిపోయిన ఆహారాన్ని పారేయకుండా, పొట్టలో వేసేవాళ్లూ చాలామందే. హరా హాచి బు సూత్రం ప్రకారం కడుపు పూర్తిగా నిండే వరకు కాకుండా సుమారు 80 శాతం నిండగానే భోజనం ఆపాలి. భోజనం నెమ్మదిగా నములుతూ తింటే త్వరగా తృప్తి కలుగుతుంది. ఇది బరువు నియంత్రణకు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను దూరం పెట్టడానికి ఉపయోగపడుతుంది. 'ఇంకో ముద్ద తినాలా?' అనిపించినప్పుడు ఆగడం కూడా ఒక ఆరోగ్య అలవాటే.

పామొడోరో -- సమయానికి విలువ

మహిళల రోజు ఒకేసారి ఎన్నో పనులతో నిండిపోతుంది. పిల్లల సంరక్షణ, వంట, ఉద్యోగం, ఇంటి పనులు.. ఇలా అన్నిటినీ నిర్వహించాల్సి వస్తుంది. పొమొడోరో పద్ధతి ప్రకారం ఒకేసారి ఒక పనిపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఉదాహరణకు 25 నిమిషాలు ఫోన్ పక్కన పెట్టి ఒక పనిని పూర్తి చేయాలి. ఆ తర్వాత ఐదు నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. మళ్లీ 25 నిమిషాలు పని చేసుకోవాలి. ఇలా చేస్తే పనులపై ఏకాగ్రత పెరుగుతుంది. రోజు చివరికి అలసట కూడా తక్కువగా ఉంటుంది.

కింట్సుగి -- గాయాలను బలంగా మార్చుకో

జీవితంలో ప్రతి మహిళ ఏదో ఒక సమయంలో నిరాశ, వైఫల్యం, అనారోగ్యం లేదా వ్యక్తిగత నష్టాన్ని ఎదుర్కొంటుంది. కింట్సుగి తత్వం ప్రకారం పగిలిన పాత్ర విలువ కోల్పోదు; దాన్ని బంగారంతో అతికిస్తే మరింత ప్రత్యేకంగా మారుతుంది. అలాగే మన జీవితంలోని గాయాలు, కష్టాలు మనల్ని బలహీనులను చేయవు. వాటి నుంచి నేర్చుకున్న పాఠాలే మన వ్యక్తిత్వాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతాయి. విఫలమైన అనుభవాలను దాచిపెట్టకుండా వాటిని ఎదుగుదలకు మెట్లుగా మార్చుకోవాలని ఈ సూత్రం చెబుతుంది. కింట్సుగి పాత్ర పగుళ్లను దాచడానికి ప్రయత్నించదు. ఆ పగుళ్లే ఆ పాత్ర చరిత్రకు, అది ఎదుర్కొన్న కష్టాలకు గుర్తులు. బంగారం పూయడం ద్వారా ఆ గాయాలనే అత్యంత అందమైన భాగాలుగా మారుస్తుంది. భవిష్యత్తులో సాంకేతికత ఎంత పెరిగినా, మనుషుల్లో ఒత్తిడి, మానసిక ఆందోళనలు, బంధాలలో బీటలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి హైటెక్ యుగంలో కింట్సుగి ఒక గొప్ప 'హీలింగ్ టూల్' (వైద్యం)లా పనిచేస్తుంది. భవిష్యత్తులో రోబోలు, పర్‌ఫెక్ట్ అల్గారిథమ్స్ మనల్ని శాసిస్తున్నప్పుడు, మనలోని 'లోపాలే' మనల్ని మనుషులుగా నిలబెడతాయి. వైఫల్యాలను చూసి కుంగిపోకుండా, వాటిని బంగారు అనుభవాలుగా మార్చుకుని ముందుకు సాగడమే కింట్సుగి నేర్పే పరమార్థం. కాబట్టి మహిళలూ... పగుళ్లు పడిన జీవితాన్ని పారేయకండి, కింట్సుగితో దాన్ని ఒక అద్భుతమైన కళాఖండంగా మార్చుకోండి.

సెయిరి -- సెయిటోన్..ఇల్లు శుభ్రం -- మనసు ప్రశాంతం

అల్మరాల్లో, వంటగదిలో, మొబైల్‌లో, మన ఆలోచనల్లో కూడా అనవసరమైన విషయాలు పేరుకుపోతుంటాయి. సెయిరి అంటే అవసరం లేని వాటిని తొలగించడం. సెయిటోన్ అంటే మిగిలిన వాటిని క్రమబద్ధంగా అమర్చుకోవడం. నెలకు ఒకసారి ఇంట్లో ఉపయోగించని వస్తువులను తొలగించడం, పత్రాలను సక్రమంగా భద్రపరచడం, మొబైల్‌లో అవసరం లేని ఫైళ్లను డిలీట్ చేయడం వంటి చిన్న చర్యలు జీవితాన్ని తేలికగా మారుస్తాయి. క్రమబద్ధత పెరిగిన కొద్దీ మానసిక ప్రశాంతత కూడా పెరుగుతుంది.

పెళ్లి చేసుకోకుండానే తల్లిని అవుతా!

చిత్ర పరిశ్రమ(లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్(మరోసారి తన బోల్డ్, స్పష్టమైన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. సాధారణంగా వ్యక్తిగత విషయాలపై చాలా ఓపెన్‌గా మాట్లాడే శ్రుతి.. తాజాగా మాతృత్వం, పెళ్లి(, తన ఆరోగ్య సమస్యల)పై చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ షోలో పాల్గొన్న శ్రుతి హాసన్ తన మనసులోని మాటను పంచుకున్నది. ప్రస్తుతం 40 ఏళ్ల వయసులో ఉన్న శ్రుతి హాసన్.. సింగిల్‌గా ఉంటూనే తన కెరీర్, వ్యక్తిగత ఎదుగుదలపై పూర్తి దృష్టి సారించినట్లు తెలిపింది.“జీవితంలో ఒక తోడు ఉండటం ముఖ్యమే. కానీ, పెళ్లి అనే సాంప్రదాయ చట్రంలో ఇమడటం నావల్ల కాదు. ఒకప్పుడు నేను పెళ్లిపీటల వరకు వచ్చి వెనక్కి తగ్గాను. కేవలం ఒక కాగితం (రిజిస్ట్రేషన్) కోసం, సమాజం కోసం పెళ్లి చేసుకోవడం నాకు నచ్చదు. ఇద్దరు వ్యక్తులు ప్రతిరోజూ ఒకరినొకరు ఇష్టపడుతూ కలిసి ఉండటమే ముఖ్యం. అలాగే, పెళ్లిళ్ల పేరిట కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ డబ్బును అనాథలకు, అవసరాల్లో ఉన్నవారికి దానధర్మాలు చేస్తే ఎంతో అర్థవంతంగా ఉంటుంది.జీవితంలో తల్లి కావాలని, ఆ మాతృత్వాన్ని అనుభవించాలని నాకు ఎంతో ఆశగా ఉంది. నాకు ఒక బిడ్డకు తల్లిని కావాలని ఉంది. అందుకోసం భవిష్యత్తులో ఒక బిడ్డను దత్తత తీసుకునేందుకు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నా. కేవలం బయోలాజికల్ కనెక్షన్(మాత్రమే కాకుండా, ఒక బిడ్డను తెచ్చుకుని పెంచడం ఎంతో అద్భుతమైన విషయం. అయితే, నాకు 14 ఏళ్ల వయసు ఉన్నప్పట్నుంచే ‘పీసీఓఎస్’ సమస్య ఉంది.



రజనీకాంత్ కోసం వెనక్కి తగ్గిన ధనుష్..



ప్రముఖ నటుడు ధనుష్ తన తదుపరి చిత్రం ‘ఓం’ విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న ‘జైలర్ 2’ సినిమాతో పోటీని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో ఈ విషయాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ధనుష్ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. “ఇలాంటి సమయాల్లో ఒక సినిమా విడుదలను మార్చడం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. మేమంతా ఎంతో ఆరాధించే, గౌరవించే సూపర్‌స్టార్ రజనీకాంత్ గారి సినిమా ‘జైలర్ 2’ అక్టోబర్ 15న వస్తోంది.

‘జార్జ్ క్రిష్’తో రొమాన్స్



చార్మింగ్ స్టార్ శర్వానంద్ దర్శకుడు శ్రీను వైట్ల కాంబోలో తెరకెక్కుతున్న పండుగ బొమ్మ ‘జార్జ్ క్రిష్’. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన ఈ మూవీ టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న సిల్హౌట్ ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ మూవీ ఫస్ట్ బూస్టర్‌ను గురువారం విడుదల చేయనున్నట్టు వెల్లడించారు.అంతేకాక ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ‘కపుల్ ఫ్రెండ్లీ’తో సూపర్ హిట్ అందుకున్న మానస.. ఈ చిత్రంలో శర్వాకు జోడీగా కనిపించనుంది. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో ప్రేమకథకు కీలక ప్రాధాన్యత ఉండబోతోందని తెలుస్తోంది. ఈ చిత్రానికి డీవోపీ: కేవీ గుహన్; సంగీతం: అనూప్ రూబెన్స్; ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా; ఎడిటర్: అమర్ రెడ్డి కుడుముల.

‘డీజే టిల్లు’లా సర్‌ప్రైజ్ చేసే ‘అనుమాన పక్షి’



‘డీజే టిల్లు’తో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ)మరో క్వీర్కీ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ(తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజాచిత్రం ‘అనుమాన పక్షి’. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మించారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న థియేటర్లలోకి రానున్న సందర్భంగా మేకర్స్ బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ.. “నటుడిగా ప్రతిక్షణం మెరుగవడానికి ప్రయత్నించా. యాక్టింగ్ నా ఊపిరి. ఇప్పుడు ‘అనుమాన పక్షి’తో హీరోగా వస్తున్నా.

ది వారియర్.. ది లెజెండ్.. ది ఎపిక్.. ‘కర్ణ’

పెన్ మూవీస్ అధినేత జయంతిలాల్ గడా సమర్పణలో ఆర్‌వీ స్టూడియోస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్ అసోసియేషన్‌లో దర్శకుడు రమేష్ వర్మ నుంచి ఐదు భాషల్లో తెరకెక్కుతోన్న భారీ పాన్ ఇండియా ఎపిక్ ‘కర్ణ’. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై మహాభారతంలోని మహావీరుడు కర్ణుడి మహాగాథ మరోసారి ఆవిష్కృతం కానుంది. ఈ మహా యోధుడి పాత్రలో ప్రముఖ నటుడు రాఘవ లారెన్స్ నటిస్తున్నారు. దర్శకుడు రమేష్ వర్మ తనదైన విజన్‌తో ఈ పురాణగాథను భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు.రూ. 150 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో రూపొందుతోంది. ఐదు భాషల్లో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక ఎపిక్.. అత్యున్నత నిర్మాణ విలువలు, భారీ సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించేందుకు



సిద్ధమవుతోంది.భారీ సెట్స్, అద్భుతమైన వరల్డ్ డిజైన్స్, భారీ యాక్షన్ సన్నివేశాలు, అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో ‘కర్ణ’ ప్రపంచాన్ని ఇంతకుముందెన్నడూ చూడని స్థాయిలో ఆవిష్కరిస్తున్నారు. మహాభారతకాలం నాటి రాజ్యాలు, యుద్ధభూములు, భారీ యుద్ధ సన్నివేశాలు.. ఇలా ప్రతి అంశాన్ని అత్యంత గ్రాండ్‌గా రూపొందిస్తున్నారు. నిజమైన సెట్స్ వైభవానికి అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ.. ప్రేక్షకులను కర్ణుడి ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. భారీ స్థాయి విజువల్స్‌తో పాటు కథలోని భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

శర్వానంద్‌కు జోడీగా మానస వారణాసి..

‘నారీ నారీ నడుమ మురారీ’, ‘బైకర్’ విజయాలతో జోష్‌లో ఉన్న చార్మింగ్ స్టార్ శర్వానంద్ దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్ లో ‘జార్జ్ క్రిష్’ పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతోంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కలర్‌ఫుల్ ఫెస్టివ్ లుక్ ఆకట్టుకుంది. అందులో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న సిల్హౌట్ ఆసక్తిని పెంచింది.తాజాగా ఈ సినిమాలో మానస



వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ‘కపుల్ ఫ్రెండ్లీ’ తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి.. ‘జార్జ్ క్రిష్’లో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి అటూప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో భాగం కాగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.